అనుదినం... జనస్వరం
ఉమ్మడి ఆదిలాబాద్
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
8 పేజీలు | సోమవారం 1 మే 2023 | www.navatelangana.com



మే డే శుభాకాంక్షలతో..
నవతెలంగాణ
ప్రత్యేక సంచిక

సంక్షేమం ఉంది..అవగాహన లేకుంది..!



- కార్మికుల కోసం ప్రభుత్వం అనేక పథకాలు
- దుకాణాలు, సంస్థల్లో పనిచేసేవారికీ సదుపాయాలు
- ఈ శ్రమ్ కార్డుతోనూ ప్రమాదబీమా సౌకర్యం
- తెలియక అనేక మంది ప్రయోజనాలకు దూరం
- నేడు 137వ ప్రపంచ కార్మిక దినోత్సవం

వివరాలు 5లో...

సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోంది. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ప్రవేశపెట్టిన ఈ పథకాలు అనేక మంది దరికి చేరడం లేదు. కార్మికుల సౌకర్యార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, ప్రయోజనాలపై అవగాహన లేని కారణంగా అనేక మంది వీటికి దూరమవుతున్నారు. భవన నిర్మాణ రంగంతో పాటు దుకాణాలు, వివిధ సంస్థల్లో పని చేసే కార్మికుల కోసం ప్రభుత్వాలు ప్రత్యేకంగా కొన్ని పథకాలు అమలు చేస్తున్నాయి. కార్మికశాఖ జారీ చేసే గుర్తింపు కార్డులు కలిగి ఉన్న వారు ఆయా పథకాలను పొందేందుకు దరఖాస్తులు చేసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఆయా ప్రయోజనాలపై అవగాహన కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా ఈ రెండేండ్లలో అతికొద్ది మంది మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారు. సోమవారం ప్రపంచ కార్మిక దినోత్సవం(మేడే)ను పురస్కరించుకొని నవతెలంగాణ ప్రత్యేక కథనం..

నవతెలంగాణ- ఆదిలాబాద్
ప్రాంతీయ ప్రతినిధి







పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జీఓ నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-జన్నారం

గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పొనకల్ గ్రామ పంచాయతీ ఆవరణలో తెలంగాణ గ్రామ పంచాయతి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులకు 8 గంటల పని విధానం ఉండాలని, కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే చికాగో నగరంలో చేసిన పోరాటంలో అమరులైన కార్మికుల ప్రాణ త్యాగలతో ఏర్పడ్డ మే డేను అందరు జయప్రదం చేయాలన్నారు. దేశంలో బీజేపీ అవలంబిస్తున్న ప్రజా, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలను సస్యశ్యామలంగా తీర్చిదిద్దడంలో, పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర చాలా కీలకం, కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ కార్మికులకు కనీస వేతనం ఇవ్వకుండా శ్రమ దోపిడీకి గురిచేస్తుందన్నారు. రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు నిరంతరం పెరుగుతున్నాయి. మల్టీ వర్కర్స్ విధానంతో పనిభారం పెరుగుతూ, కార్మికులు అనారోగ్య బారిన పడుతు, ప్రమాదలకు గురవుతున్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం చేయాలన్నారు. లేకుంటే రాబోయే రోజుల్లో గ్రామపంచాయతీ కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కనికరపు అశోక్, పూసవేర్ల రాజన్న, కే.బుచ్చన్న ప్రజా సంఘాల నాయకులు, గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్, మండల అధ్యక్షుడు రవి, లక్షెట్టిపేట్ మండల అధ్యక్షులు అవునూరి సాగర్ పాల్గొన్నారు.

కబడ్డీ ఉచిత శిక్షణ కేంద్రం సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా యువజన క్రీడల విభాగం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో నిర్వహిస్తున్న కబడ్డీ వేసవి ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శిక్షకుడు ఫిజికల్ డైరెక్టర్ తిరుపతి తెలిపారు. ఆదివారం ప్రారంభమైన శిక్షణ కేంద్రం మే 31వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆధార్ కార్డు ఒక పాస్ ఫోటో తీసుకొని రావాలని తెలిపారు. ఉదయం 5:30 నుంచి 7.30 వరకు సాయంత్రం 5:30 నుండి 6.30 వరకు శిక్షణ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 9949300668 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

నవతెలంగాణ-జన్నారం

వరి ధాన్యాన్ని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే అమ్మాలని మండలంలోని కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ కోల తార, ఎంపీటీసీ మచ్చ పోషవ్వ శంకరయ్య, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ జి.రాజేష్ యాదవ్ సూచించారు. ఆదివారం కిష్టాపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వాసాల నరేష్, గట్టు మహేష్, డైరెక్టర్ శోభన్, వార్డు సభ్యులు ఎన్.నారాయణ, కే.చంద్రయ్య పాల్గొన్నారు.



ఆధునీకరణతో పెరిగిన ఉత్పత్తి

పూర్వ వైభవాన్ని సంతరించుకుంటున్న సిర్పూరు పేపర్ మిల్లు

నెలకు సుమారు 11 వేల టన్నుల పేపర్ ఉత్పత్తి

పాత కార్మికులను పనిలోకి తీసుకోకపోవడం, స్థానికేతరులకు ఉపాధి కల్పించడమే అవరోధం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు. ఆరేడేళ్ల క్రితం ఈ పేరు వింటే అది గడిచిపోయిన చరిత్రగా భావించేవారు. కాని ఇప్పుడు ఆ మిల్లు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది. 2014లో మూతపడ్డ ఈ మిల్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవతో 2018లో పున:ప్రారంభమైంది. తర్వాత కూడా ఈ మిల్లుపై నీలినీడలే కమ్ముకున్నాయి. ఈ మిల్లు కొనసాగుతుందా, లేక మళ్లీ మూతపడుతుందా అనే అనుమానాలు అనేకముండేవి. ఈ మిల్లును తీసుకున్న జేకే యాజమాన్యం ఎక్కడా వెనక్కి తగ్గకుండా పేపర్ అధిక ఉత్పత్తికి అవసరమైన చర్యలు తీసుకుంటుండడంతో ఈ మిల్లులో పేపర్ ఉత్పత్తి గణనీయంగా పెరిగింది.

రూ. 1000 కోట్లతో మిల్లు ఆధునీకరణ

2014కు ముందు ఈ మిల్లులో ఎనిమిది పేపర్ యంత్రాలు ఉండేవి. ఆ యంత్రాల ద్వారా అప్పట్లో రోజుకు 280 టన్నుల పేపర్ ఉత్పత్తి జరిగేది. 2018, ఆగష్టు రెండో తేదీన ఈ మిల్లును పరిశ్రమల శాఖా మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఆరు నెలల పాటు మిల్లు పునరుద్దరణ చర్యలు చేపట్టారు. రూ. 1000 కోట్లతో మిల్లు ఆధునీకరణ పనులు చేపట్టారు. అనంతరం రెండు యంత్రాల ద్వారా పేపర్ ఉత్పత్తి ప్రారంభించారు. దశల వారీగా మూడు, నాలుగు యంత్రాలను ప్రారంభించారు. ఇపుడు నాలుగు యంత్రాల ద్వారా రోజుకు 350 నుండి 400 టన్నుల పేపర్ ఉత్పత్తి జరుగుతోంది. నెలకు సుమారుగా 11 వేల టన్నుల పేపర్ ఉత్పత్తి జరుగుతోంది. ఏడాదికి 1,36,000ల పేపర్ ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించగా, ప్రస్తుతం 1,20,000ల వరకు పేపర్ ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుతం మిల్లులో 510 మంది పర్మినెంట్ కార్మికులు ఉండగా, కాంట్రాక్టు కార్మికులు 1700కు పైగా ఉన్నారు. ఇక్కడ స్థానికేతరులు, స్థానికులనే సమస్య ఉత్పన్నమవుతోంది.

నాలుగేళ్లకోసారి వేతన ఒప్పందం

ఈ మిల్లులో నాలుగేళ్లకోసారి వేతన ఒప్పందం జరుగుతోంది. ప్రస్తుతం రూ. 4,050తో కొనసాగుతున్న వేతన ఒప్పందం మార్చి, 2026 వరకు అమలులో ఉంటుంది. దీనికి అదనంగా మిల్లు యాజమాన్యం ఉత్పత్తి బోనస్‌ను రూ. 750 నుండి రూ. 1,250 వరకు చెల్లిస్తోంది. ఇంక్రిమెంట్ రూ. 25, మూడు నెలలకోసారి వీడీఏ పాయింట్లను కూడా యాజమాన్యం క్రమం తప్పకుండా చెల్లిస్తోంది. పీఎఫ్ 12 శాతం, ఈఎస్ఐ నాలుగు శాతం మొత్తం 16 శాతం యాజమాన్యం చెల్లిస్తోంది. కార్మికుల సంక్షేమానికి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతీ ఏడాది ఓపెన్ ఫోరం పేరుతో కార్మికులతో యాజమాన్యం సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకుంటోంది. ప్రతీ నెలా కూడా సంపర్క పేరుతో సమావేశాలు నిర్వహిస్తోంది. గడిచిన రెండేళ్లుగా మిల్లు పరిసర గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించి వైద్యపరీక్షలతో పాటు మందులు పంపిణీ చేస్తున్నారు. సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సంస్థతో యాజమాన్యం ఏడాదిన్నర ఒప్పందం కుదుర్చుకొని కాగజ్‌నగర్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని 11 పంచాయతీలలో ప్లాస్టిక్ నివారణ కోసం అవగాహన సదస్సులు పెడుతోంది.

స్థానిక కార్మికులకు దొరకని ఉపాధి

ఈ మిల్లులో స్థానికులను కాదని, స్థానికేతరులకు ఉపాధి కల్పిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో పని చేసిన 190 మంది పర్మినెంట్ కార్మికులను మిల్లు యాజమాన్యం ఇప్పటి వరకు విధుల్లోకి తీసుకోలేదు. వీరు పలు దఫాలుగా ఆందోళనలు చేపట్టినా యాజమాన్యం నుండి ఎలాంటి స్పందన లేదు. దీనితో ఈ కార్మికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మిల్లులోని పలు విభాగాలను యాజమాన్యం కాంట్రాక్టుకు అప్పగించింది. ఈ కాంట్రాక్టులన్నీ స్థానికేతరులే దక్కించుకోవడం, వారు కార్మికులను తమ ప్రాంతాల నుండే తెచ్చుకోవడంతో స్థానిక కార్మికులకు అన్యాయం జరుగుతోంది. నామమాత్రంగా కొద్ది మంది స్థానికులకే ఉపాధి కల్పిస్తున్నారు.

ఈ ఏడాది నుండే లాభాల బాటలో : రమేష్‌రావు, చీఫ్ మేనేజర్



సిర్పూరు పేపర్ మిల్లు ఈ ఏడాది నుండే లాభాల బాటలో పయనిస్తోంది. గడిచిన మూడేళ్ల కాలంలో మిల్లు నుండి ఎలాంటి లాభాలు రాలేదు. రూ. 1000 కోట్లతో మిల్లులో కొత్త బాయిలర్ ఏర్పాటు, మిల్లు యంత్రాల ఆధునీకరణ చేపట్టారు. ఫలితంగానే నాలుగు యంత్రాల ద్వారానే గణనీయంగా ఉత్పత్తి పెరిగింది. గత యాజమాన్య హయాంలో ఎనిమది పేపర్ యంత్రాలు ఉండగా, ఇపుడు నాలుగు యంత్రాల ద్వారా రెట్టింపు ఉత్పత్తి తీస్తున్నారు. దీనితో కార్మికుల సంఖ్యను తగ్గించక తప్పలేదు, ఫలితంగా సుమారు 150 మంది పర్మినెంట్ కార్మికులకు పని కల్పించని విషయం వాస్తవమే. ఇది ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉంది. రాబోయే రోజులలో యాజమాన్యం మరిన్ని ఆధునీకరణ పనులు చేపట్టి ఉత్పత్తి పెరుగుదలకు చర్యలు తీసుకుంటుంది.

పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం

• ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజ అభివృద్ధిలో కార్మికులు కీలక పాత్ర పోషిస్తారని, అటువంటి కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటమే లక్ష్యమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. మేడే సందర్భంగా నవతెలంగాణతో ఆయన మాట్లాడారు. ఏ ప్రభుత్వం వచ్చిన కార్మికులకు అండగా ఉంటామని చెబుతున్నప్పటికీ నిజజీవితంలో జరగడం లేదు. దీంతో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాటం చేస్తూ, వారితో మమేకమై ముందుకు సాగుతూ, వారి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. వివిధ సంఘాలకు మద్దతుగా తాము చేసిన పోరాటాలను గుర్తు చేశారు. సింగరేణికి నాలుగు బొగ్గు బ్లాక్‌లను కేటాయించాలని పోరాటాలు, ధర్నాలు ఆందోళన కార్యక్రమాలు చేశామన్నారు. దీనికి అనుకూలంగా దేశవ్యాప్త సమ్మె చేయడం జరిగిందన్నారు. కోల్ ఇండియాలో విదేశీ పెట్టుబడులను వెంటనే ఉపసంహరించుకోవాలని దేశవ్యాప్త సమ్మెతో పాటు, తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి వ్యాప్తంగా తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని, వడ్డీ లేని రుణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులు 30 వేల మంది పనిచేస్తున్నారని, వీరందరికి కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గతంలో చేసిన సమ్మె ప్రకారం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. సింగరేణిలో అన్ని విభాగాలు పనిచేస్తున్నటువంటి కాంట్రాక్టు కార్మికులకు సీఎం, పీఎం హాస్పిటల్ సౌకర్యం లేదా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో రద్దు చేసిన ట్రేడ్ యూనియన్ లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్ డిపో పరిధిలో జరిగిన డిజిల్ కుంభకోణాన్ని బయటకు తీసుకువచ్చి డిపో మేనేజర్‌తో సహా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఐదు మంది అధికారులను సస్పెండ్ చేయడంలో విజయం సాధించినట్లు తెలిపారు. ఎస్పీఎం కార్మికులకు అండగా పోరాటం చేస్తున్నామని పాత కార్మికులను యధావిధిగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల కనీస వేతనం



రూ.32000 ఇవ్వాలన్నారు. సివిల్ సప్లై హమాలీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు జీవో నెంబర్ 15 ప్రకారం వేతనాలు ఇవ్వాలని గతంలో సమ్మె చేశామని, దీనికి అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అమలుపరచడం తమ విజయమన్నారు. గ్రామపంచాయతీ కార్మికులలో మల్టీపర్పస్ విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. రెండవ ఏఎన్ఎంలను జీవో నెంబర్ 16 ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఏఐటీయూసీ కార్మికులకు అండగా ఉండి పోరాడుతుందని పునరుద్ఘాటించారు. జిల్లాలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న సంఘటిత అసంఘటిత రంగ కార్మికులకు అండగా ఉంటామని వారి సమస్యల పట్ల నిరంతరం పోరాడుతామన్నారు. జిల్లాలోని కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు.

వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలి

- టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి తోడసం భీంరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదివాసీ వ్యతిరేక చట్టాలను రూపొందిస్తూ వారిని అడవిలో నుంచి వెల్లగొట్టే ప్రయత్నం చేస్తున్న బీజేపీ నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి తొడసం భీంరావ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో రాష్ట్ర కమిటీ సభ్యురాలు కోరింగ మాలశ్రీ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ప్రథమ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అడవులను కార్పొరేట్లకు అప్పగించి ఆదివాసీలను వెళ్లగొట్టేందుకు ప్రయత్నాలు చేస్తుందని దీనిలో భాగంగా అటవీ చట్టాలు రూపొందించిందన్నారు. బీజేపీ విధానాలపై పోరాటం చేయకుంటే భవిష్యత్తులో ఆదివాసీల అస్తిత్వం లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. 2006 అటవీ హక్కుల చట్టాన్ని తుంగలో తొక్కుతూ అటవీ పరిరక్షణ నియమాలు తీసుకువచ్చిందని దీనిలో అడవిని ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చేవిదంగా నిబంధనలు రూపొందించిందన్నారు. దీని ద్వారా ఆదివాసులకు



నష్టం జరుగుతుందని అన్నారు. ఏజెన్సీలో టీచర్ ఉద్యోగాలు 100శాతం ఆదివాసులకే ఇచ్చే విధంగా ఉన్న జీఓ నెంబర్ 3ను సుప్రీంకోర్టు ద్వారా రద్దు చేయించిందన్నారు. కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు లేకుండా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు అప్పనంగా ఇస్తుందన్నారు. పేదల భూములకు హక్కు పత్రాలు ఇవ్వడానికి చేతులు రావడం లేదని, ఆదివాసులు అడవిని నాశనం చేస్తున్నారని ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు ఒరిస్సాలో ఆదాని కోసం 40 వేల చెట్లను నరికించారన్నారు. ఆదివాసీలకు అన్యాయం చేసే విధంగా కేంద్ర బీజేపీ సర్కార్ చేస్తున్న విధానాలపై ఐక్యపోరాటం చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న కేసీఆర్ సర్కార్ సైతం ఆదివాసీలకు అన్యాయం చెసే విధంగా 1/70, పేసా చట్టాలను నిర్వీర్యం చేస్తుందని అన్నారు. పోడు భూములకు పట్టాలిస్తామని చెప్తూనే సర్వేలు చేయించి వాళ్ల స్వచ్ఛంద సంస్థల ద్వారా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి హక్కు పత్రాలు రాకుండా కుట్ర పన్నుతున్నారని అన్నారు. అటవీ అధికారుల ద్వారా దాడులు చేయించి అక్రమ కేసులు పెడుతున్నారని వీటిపైన పోరాటం చేయాలని అన్నారు. ఆదివాసి హక్కుల పరిక్షణకు, స్థానిక సమస్యల పై సమరశీల పోరాటాలు చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి నైతం రాజు, ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు దూలలక్ష్మి, నల్లి దామోదర్, మాడవి గణపతి, శ్యగాం కమల, పోతరాజుల తార, సుంకే లక్ష్మి, బండి మల్లేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తిక్, జిల్లా నాయకులు గేడం టికానంద్, దుర్గం రాజ్ కుమార్, సీఐటీయు జిల్లా కార్యదర్శి రాజేందర్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాల రక్షణకు ఉద్యమం తీవ్రతరం

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కార్మికులు పోరాడి సాధించుకున్న 137 ఏళ్ల క్రితం నాటి హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా, కార్మిక చట్టాల రక్షణ కోసం రాబోయే రోజులలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టనున్నట్లు సీఐటీయూ కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ తెలిపారు. మేడే సందర్భంగా 'నవతెలంగాణ'తో ఆయన మాట్లాడారు. కేంద్రం యాజమాన్యాలకు కొమ్ము కాసే విధంగా నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కార్మిక హక్కులను కాలరాసే ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. జిల్లాలో అసంఘటితరంగ, కాంట్రాక్టు, స్కీం వర్కర్లు అధికంగా ఉన్నారని, వీరికి కనీస హక్కులు అమలు కావడం లేదని అన్నారు. ముఖ్యంగా జిల్లాలో బిల్డింగ్, హమాలి, ఇటుక బట్టీలు, జిన్నింగ్ కార్మికులు అసంఘటితరంగ కార్మికులుగా ఉన్నారని, సింగరేణి, సిర్పూరు పేపర్ మిల్లులో కాంట్రాక్టు కార్మికులు ఉన్నారని తెలిపారు. వీరితో పాటు వివిధ ప్రభుత్వశాఖలలో స్కీం వర్కర్లు ఉన్నట్లు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలకు సంబంధించి ఐదు జీఓలు విడుదలైనా, నేటికీ గెజిట్ రాకపోవడంతో ఆ కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని అన్నారు. ఎనిమిదేళ్ల క్రితం నాటి వేతనాలే నేటికీ అమలవుతున్నాయని అన్నారు. గెజిట్ విడుదలైతే సుమారు 10 వేల మంది కార్మికులు లబ్ది పొందనున్నట్లు తెలిపారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని అన్నారు. స్కీం వర్కర్లచే ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందని అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న వీరికి ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి కనీస హక్కులకు కూడా నోచుకోవడం లేదని అన్నారు. కార్మిక చట్టబద్ధ హక్కులు కల్పించబడాలంటే కార్మికులు మేడే స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు.

ప్రజా పోరాటాలతోనే హక్కుల సాధన

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్



నవతెలంగాణ-కాసిపేట

ప్రభుత్వాలను అడుక్కుంటే హక్కులు రావని, ప్రజాపోరుతో వాటిని సాధించు కోవచ్చని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతా రామయ్య పేర్కొన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ సమగ్రాభివద్ధికి సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 13వ రోజు ప్రజా పోరు యాత్రను మండల కేంద్రంలో వారు ప్రారంభించి మాట్లాడారు. ముందుగా అంగడి బజారులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ 9 ఏండ్ల మోడీ, కేసీఆర్ పాలనలో ధరల నియంత్రణ లేక పేద ప్రజలు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఆదాని, అంబానీ లు అందళమెక్కితే, అడ్డకూలీల బతుకులు అగమవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలుపరచాలని,నియోజక వర్గ ప్రజలకు గోదావరి మంచినీటిని అందించాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని, నూతన బొగ్గు బావులను ప్రారంభించాలని, ఉద్యోగ-ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రేగుంట చంద్రశేఖర్, మండల కార్యదర్శి దాగం మల్లేష్, ప్రజా పోరు యాత్ర, దళసభ్యుడు దాడి గట్టయ్య, జాడి పోశం, దుర్గం సుదాకర్, ర్రాష్ట సమితి సభ్యులు బొల్లం పూర్ణిమ, మేకల దాస్, జొగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మామిడాల రాజేశం, లింగం రవి, మిట్టపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సచివాలయ ప్రారంభోత్సవంలో ఉమ్మడి జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ నూతన సచివాలయ భవన ప్రారంభోత్సవం కార్యక్రమం ముఖ్యమంత్రి చేతుల మీదుగా నిర్వహించగా ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తన కార్యాలయం ప్రారంభోత్సవంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కాడేతో పాటు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సర్వీసులను క్రమబద్దీకరణ చేస్తూ రూపొందించిన ఉత్తర్వులపై సంతకం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటామని కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్ కుమురంభీం జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్ ప్రధాన కార్యదర్శి మిర్యాల్కార్ శ్రీనివాస్ లు ఒక ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఎంతో మంది హామీ ఇచ్చారని 23 సంవత్సరాల తన నిరీక్షణకు తెరదించడంతోపాటు ఎంతోమంది జీవితాలకు జీవం పోసిన గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి అని ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటామని అన్నారు.

బీసీల జనగణన వెంటనే చేపట్టాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీసీల జన గణన వెంటనే చేపట్టాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వెనుకబడిన వర్గాల మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ బంద్ కు వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. జిల్లాలో చేపట్టిన బందులో భాగంగా నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీల జనగణన వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఓటింగ్ ప్రక్రియలో ఈవీఎంలను తొలగించాలని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రమేష్, కార్యదర్శి మారుతి పటేల్, పిప్రే సాయి, బహుజన్ క్రాంతి మోర్చా జిల్లా కార్యనిర్వహకులు వాసుదేవ్, భారత్ ముక్తి మోర్చ జిల్లా కార్యనిర్వహకులు డాక్టర్ ముంజం మనోహర్, కార్యవర్గ సభ్యులు జాడే అశోక్, జాడే రాందాస్ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

నవతెలంగాణ-బెజ్జూర్

మండలకేంద్రంలోని శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఏలేశ్వరం పురుషోత్తమాచారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మంగారి విగ్రహానికి అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు చాకటి బ్రహ్మయ్య, పూసాల బ్రహ్మయ్య సుంకరి రమేష్, ఏలేశ్వరం ప్రభాకర్, ఏలేశ్వరం శ్రీనివాస్, శ్రీ రామ్ మోహన్, ఏలేశ్వరం శ్రీకాంత్, సుంకరి కమలాకర్, శ్రీధర్, శ్రీరామ అశోక్ పాల్గొన్నారు.

నస్పూర్‌లో అంబలి పంపిణీ

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి తాపం తీర్చేందుకు అంబలి పంపిణీ కేంద్రాలను ప్రారంభించారు. ఆదివారం ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ట్రస్ట్ సెక్రెటరీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ నాలుగు కేంద్రాల్లో అంబలి పంపిణీ ప్రారంభించారు. నస్పూర్ పట్టణంలో సీసీసీ కార్నర్, శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద అంబలి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వారు చెప్పారు. అంబలితో పాటు మామిడికాయ పచ్చడి కూడా ఇంట్లో తయారు చేసి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వేసవిలో అంబలి తాగడం వల్ల ఎంతో ఉపశమనం కలుగుతుందని వారు తెలిపారు. నిరంతరం ప్రజలకు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూనే ఉంటామని పబ్లిసిటీ కోసం మాత్రం పరితపించమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్, 20 కౌన్సిలర్ సురిమిల్ల వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వనపర్తి రాజేష్, చిలుక మల్లేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలి

నవతెలంగాణ-జన్నారం

కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి పురంశెట్టి బాపు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో, మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక చట్టాలను అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. కార్మికులకు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్మికులంతా మే డేను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, మల్లేష్ ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు, లక్ష్మీకాంతం పాల్గొన్నారు..

కడెం నుంచి హైదరాబాద్‌కు సూపర్‌లగ్జరీ బస్సు

నవతెలంగాణ- నిర్మల్

నిర్మల్ డిపో ఆధ్వర్యంలో కడెం నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సును ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ డీఎం సాయన్న తెలిపారు. జిల్లాకేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఈ బస్సు ప్రతీ రోజు రాత్రి 8.30 గంటలకు కడెం నుంచి బయలు దేరి రాత్రి 9 గంటలకు ఖానాపూర్ చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు బయలు దేరుతుందని తెలిపారు. ప్రతీ రోజు రాత్రి 10.15 గంటలకు హైదరాబాద్ నుంచి బయలు దేరి ఉదయం 4 గంటలకు ఖానాపూర్‌కు, అక్కడి నుంచి 5 గంటలకు కడెం చేరుకుంటుందన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

శ్రమ నైజం మారిందా ?

ఎరుపు పేరింటే అదరి పడేటోళ్ళు
కార్మికుడు మారాడంటున్నారు
యూనిఫాం విడిచాడంటున్నారు
తెల్ల చొక్కాలో తడిచాడంటున్నారు
రూపంలో మార్పులు చూపుతూ
తన వర్గమే మారాడంటున్నారు
మార్క్సిజం మాసిందంటున్నారు
కష్టజీవులు సంపద పెంచడం తగ్గిందా?
జీతభత్యాల జమలో వాటా ధనం దక్కిందా?
ఉన్నా లేని జనాల అసమానతలు
మాసాయా?
పెట్టుబడి ఫిరంగులు
కురంగులయ్యాయా?
ఏది మారింది కనుక ఎరుపు మెరుపు
మాసింది?
పిల్లి ఢీలా పడితే ఎలుక
ఎకసెక్కాలాడినట్టు
చట్ట సభల సీట్లతో కొలిచి ఎరుపు
ఘూటేదంటూ
కష్టజీవుల వాటాకు కొర్రీలు పెడితే
పెట్టచ్చు
అలా పడినప్పుడు ఉబికే కంటి తడి
తుడిచేదెవరు?
ఎకసెక్కాలకేం ఎన్నైనా ఆడొచ్చు
ఎర్ర జెండా అయి నిలిస్తే నిజం లోతు
కనిపిస్తుంది
జనానికి దాని అవసరం తెలుస్తుంది ... ఏదీ లేని..
గాలి పడవలు వాటం తప్ప గమ్యం ఎరుగవుగా?
జీతాల కోతలతో శ్రమ వాటా గుంజేయడం
పనిలేని జీవులు ఆకలి, ఆత్మహత్యల
కాష్టంలో కమిలి కాలి బూడిదవడం
వాళ్ళ వాటా సంపదతో 'కార్పొ'ల ఆస్తులు
పెంచుకోవడం
దాన్ని 'సొంత ఆస్తి' లెక్కలతో చుక్కల్లో నిలవడం
ఉన్న లేని జనాల వర్గ స్వరూపమేగా
కడుపు కాలిన నాడు వాటాల సమ పంపకానికి
వీధుల్లో కలబడటం వర్గ పోరాటమేగా
కళ్ళ ముందు కణిక నిప్పులు మండుతుండగా
నిర్వచనాలు మార్చి కళ్ళకు గంతలు తగిలించంకునే
గాంధారి పాతివ్రత్యపు గొప్పల గప్పాలు అవసరమా?

ఉన్నం వెంకటేశ్వర్లు

పెట్టుబడుదారులకోసం

కార్మికుల హక్కులు కాలరాత

చికాగో త్యాగాలతో కార్మిక ఉద్యమం కనీస విలువలను చట్టబద్ధం చేసుకోగలిగింది. ఇట్లాంటి అనేక త్యాగాలతో ప్రపంచ కార్మిక ఉద్యమం తన కాళ్లపై తన నిలబడగలిగి మానవాళి విముక్తి కోసం తన శక్తిని ధారపోస్తు వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడ్డ సంక్షోభంతో కార్మిక శక్తి ఒత్తిడి మేరకు ప్రపంచ రాజ్యాలు సంక్షేమాన్ని తమ ప్రాధాన్యతగా ఎంచుకోవాల్సి వచ్చింది. ఫలితంగానే సంక్షేమ రాజ్య భావన బలపడి బలహీనుడికి బతకగలిగే అవకాశం కొద్ది మేరకైనా దక్కగలిగింది. యుఎస్ఎస్ఆర్ పతనం తర్వాత కార్మిక ఉద్యమాన్ని విధ్వంసం చేయగలిగే వాతావరణాన్ని ప్రపంచ పెట్టుబడిదారీ మార్కెట్ శక్తులు రూపొందించుకున్నాయి అంతకుముందే ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలు ఇందుకు దోహదం చేశాయి కూడా.

1977 నుంచి ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలు రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ గారడి పాలనలో పెట్టుబడిదారీ విధానం మరింత బలోపేతమై అంతిమంగా పెట్టుబడిని కూడా మింగే కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థ దేశంలో పాదుకొల్పబడింది. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా దేశంలో ఆటవిక నిర్వహణ రాకుండా ఉండేందుకు ఆర్థిక వ్యవస్థను ప్రజాసంక్షేమాన్ని సమన్వయం చేసుకునే అద్భుతమైన కార్మిక చట్టాల రూపకల్పన 1926 నుంచే(ట్రేడ్ యూనియన్‌లో ఏర్పాటు చట్టం) ప్రారంభమైంది. ఇది క్రమక్రమంగా కార్మిక సంక్షేమం విస్కృతి చెందింది. 1200 సెక్షన్లతో 44 కార్మిక చట్టాలతో పెట్టుబడిని ప్రభుత్వాన్ని నియంత్రిస్తూ వచ్చింది. కానీ ఈ చట్టాలు ఆశ్రిత పెట్టుబడి లేదా కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా ఉండడంతో కార్పొరేట్ శక్తులు మతసహచర్యాన్ని ఆశ్రయించాయి. తమకు అనుకూలమైన వ్యక్తిని ప్రధానిగా ప్రతిష్టింప చేసుకున్నాయి.

ఈ చట్టాలే కార్మికులను సంరక్షించుకున్నాయి వీటి రూపకల్పనలో మహనీయుడు అంబేద్కర్ విశేషమైన కృషి చేశారు. నేటి ప్రధాని మోడీ అదే అంబేద్కర్ కార్మిక ఆలోచనలను వక్రీకరించి తన వారికి దోచిపెట్టడానికి 44 కార్మిక చట్టాలను 29 చట్టాలకు కుదించి 12 చట్టాలను పూర్తిగా రద్దుచేసి నాలుగు కోడ్ లుగా విభజించారు. అంబేద్కర్ కలల సాధన కోసం, నూతన



భారతదేశం కోసమని "రెడ్ టేపిజాన్ని" ఆపుతానని అనడమే కాక శ్రమ యోగి రాష్ట్ర యోగి అనే నూతన పేర్లతో కార్మికులకు పేరు పెట్టి నయవంచనకు గురి చేశాడు. ఇప్పటికే తన విధానాలతో 8 కోట్ల సంఘటిత కార్మిక శక్తిని 5 కోట్లకు కుదించేసినాడు. దీనితో దేశంలో 50 కోట్లకు అసంఘటిత కార్మికులు పెరిగిపోయినారు. భద్రత లేని కనీస బతుకుదెరువు లేని అసంఘటిత కార్మికులకు ఆరోగ్య భీమా లాంటి ఎరలు వేసి మొత్తం ఆర్థిక వ్యవస్థ ఫలాలను తన ఇద్దరు మిత్రులైన ఆదాని అంబానీలకు కట్టబెడుతున్నాడు. ఈ క్రమంలో మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో దేశానికి తీవ్రమైన నష్టాన్ని ఈ పాలకులు కల్పించారు. పనిగంటలను పెంచడంతో కార్మికులకు మరింత ఒత్తిడి పెరిగి పెద్ద ఎత్తున మరణాలు సంభవిస్తున్నాయని కొన్ని దేశాల అనుభవాలు సాటి చెబుతున్నాయి. 2016 ఒక్క సంవత్సరంలోనే 7,60,000 మంది పని గంటల పెంపుదల కారణంతో అసహజంగా మరణించారని 'ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ' రిపోర్టులు చెబుతున్నాయి. అంతే మేరకు ఈ పని గంటలు ఉపయోగించుకున్న పారిశ్రామిక సంస్థలు కార్పొరేట్ సంస్థలు గా మారిపోయినాయి.

సమ్మె హక్కును ను జీవించే హక్కులో భాగంగా పొందిన కార్మికులు ఈ కొత్త చట్టాలతో కోల్పోతున్నారు. 15 రోజుల ముందు ఇచ్చే సమ్మె నోటీసు కాస్త 60 రోజుల ముందుగా మారింది. ఏడుగురితో కూడా యూనియన్ ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని మార్చివేసి దేశ కార్మిక సంఘాల త్యాగాల చరిత్రను 1926 నాటికి తీసుకుపోయారు. యూనియన్ లో 1/3 బయటివారు ఉండడం వల్ల కార్మికులు యజమానులకు భయపడకుండా అన్యాయం జరిగినప్పుడు నిలదీసే అవకాశం ఉండేది. అది నేడు లేబర్ కోడ్‌ల రూపంలో తొలగించారు., యూనియన్‌కు కంపెనీ ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించుకునే అవకాశం గతంలో ఉండేది. ఆ కంపెనీ అక్రమ లాభాలు ఎక్కడ బయటపడతాయోనని ఈ పర్యవేక్షణ అవకాశాన్ని తొలగించారు. సమస్యను లేవదీసే హక్కును కూడా కోల్పోయారు. ఈ కొత్త చట్టాలతో మహిళా కార్మికులకు 12 నుంచి 26 వారాల ప్రసూతి సెలవు లాంటి ఒక చిన్న ఎరను వేసి రాత్రి వేళలో కూడా 12 గంటల నుంచి 16 గంటలుగా శ్రమ దోపిడిని పెంచుకుంటున్నారు. పని పరిస్థితులు, రుతుస్రావాలు మొదలగునవి కూడా కంపెనీ ఆలోచన చేతుల్లోకి వెళ్లిపోయాయి. లంచ్ రూమ్ క్యాంటీన్,రెస్ట్ రూమ్, డ్రింకింగ్ వాటర్, ఫీడింగ్ రూములు, ఇలాంటి కనీస సౌకర్యాలను ఈ చట్టాలు తీవ్రమైన ప్రభావితం చేయబోతున్నాయి. యజమాన్యాలు కనీసం కార్మికులను మనుషులుగా గుర్తించే పరిస్థితి కూడా లేకుండా పోయింది.

కార్మికుల తొలగింపుకు గతంలోని మార్గదర్శకాలు మారిపోయాయి. అతి చిన్న కారణమైనా,అసలు కారణాలే లేకుండా కూడా కార్మికులను తొలగించే అవకాశాలు నిరంతరంగా యాజమాన్యాలకు కల్పించాయి. తొలగించబడ్డ కార్మికులు న్యాయస్థానాలకు వెళ్లే అవకాశాన్ని కూడా ఈ కొత్త చట్టాలు అడ్డుకుంటున్నాయి. యజమాని ఆధ్వర్యంలో రూపొందించబడ్డ మధ్య దళారీ వ్యవస్థ చేతుల్లోకి కార్మికుల తొలగింపు నిర్ణయం వెళ్ళబోతుంది. ఇలాంటి అత్యంత దారుణమైన, మానవ పరిణామ క్రమాన్ని వెనక్కి తిప్పిన మోడీ చట్టాలు రాజస్థాన్ లో ప్రయోగాత్మకంగా అమలై అభ్యుదయ పాలనలో ఉన్న తమిళనాడు రాష్ట్రం కూడా ఇటీవల కాలంలో అమలుకు సిద్ధపడ్డది. తెలంగాణ ఇంకా వేగంగా యజమానులకు సహకారం అందించే పద్ధతిలో కార్మికులకు వ్యతిరేకంగా అత్యుత్సాహాన్ని ప్రదర్శించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల ప్రయోజనం దృష్ట్యా కార్మిక చట్టాలను నిలిపివేయాలి. పౌర సమాజం కార్మికులు సంఘటితోద్యమం చేయడం ద్వారా సమ్మె హక్కును కోల్పోతే బానిసగా మారుతామనే అంబేద్కర్ అభిప్రాయంతో చికాగో పోరాటస్ఫూర్తిని ఎత్తు పట్టి ప్రతిగాధ శక్తులను అడ్డుకుందాం.

పందుల సైదులు
9441661192

కార్మిక చట్టాల అమలుకు నిరంతరం కృషి

- జిల్లా కేంద్రంలో రూ.కోటితో సంక్షేమ భవన్
- ప్రభుత్వ ప్రయోజనాలు వినియోగించుకోవాలి
- జిల్లా కార్మికశాఖాధికారి జి.రాజలింగు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలు.. అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని జిల్లా కార్మికశాఖ అధికారి జి.రాజలింగు అన్నారు. ప్రభుత్వం ప్రతి జిల్లా కేంద్రంలో రూ.కోటితో కార్మిక సంక్షేమ భవన్ నిర్మిస్తోందని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనూ ఈ భవన్ నిర్మాణం కోసం స్థల సేకరణ చేపడుతున్నట్లు వివరించారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్మికశాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై నవతెలంగాణతో మాట్లాడారు.

కార్మికులకు ప్రయోజనాలు

జిల్లాలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న భవన నిర్మాణ రంగం, దుకాణాలు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల ప్రయోజనం కోసం ప్రభుత్వం వివిధ పథకాలు ప్రవేశపెట్టింది. వీటిని అర్హులైన లబ్ధిదారులందరికీ అందజేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా దుకాణాలు, వివిధ సంస్థల్లో పనిచేసే కార్మికుల కోసం కూడా ప్రభుత్వం వివిధ రకాల పథకాలు అందజేస్తోంది. వీటిపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతూ కార్మికులకు తెలిసేలా చేస్తున్నాం. సెలవు రోజుల్లో పనిచేస్తే డబుల్ వేతనం అందించాల్సి ఉంటుంది. దీనిపై కార్మికులకు అవగాహన ఉంది. ముఖ్యంగా అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ శ్రమ్‌కార్డును తీసుకోవాలి. సీఎస్‌సీ సెంటర్‌లో ఆధార్, బ్యాంకు ఖాతాలతో ఎలాంటి రుసుము లేకుండా ఈ కార్డులు పొందేందుకు వీలుంటుంది. ఈ కార్డు కలిగిన వారికి ప్రమాద బీమా రూ.2లక్షలు వస్తుంది. ముఖ్యంగా బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలిస్తున్నాం. ప్రతి ఏటా ఆపరేషన్ ముష్కాన్, స్మైల్ పేరిట వివిధ శాఖల సమన్వయంతో చేపడుతున్నాం. కార్మికులను ఎవరైనా దుకాణ యజమానులు వేధింపులకు గురిచేస్తే తమకు ఫిర్యాదు చేయాలి.

దుకాణదారులు అనుమతి తీసుకోవాలి

ప్రభుత్వం ఇటీవల 24గంటల పాటు దుకాణాలు తెరుచుకునేందుకు అవకాశం కల్పించింది. ఆయా దుకాణదారులు రూ.10వేల డీడీ చెల్లించి కార్మికశాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం అనుమతులు జారీ చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్కరు ఇందు కోసం దరఖాస్తులు చేయలేదు. భవిష్యత్తులో 24గంటల పాటు దుకాణాలు తెరిచి ఉంచాలంటే అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయం ఆయా దుకాణదారులు గమనంలోకి తీసుకోవాలని కోరుతున్నాం. దుకాణాల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి ఈ శ్రమ్‌కార్డు ఉండేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆయా దుకాణాల్లో కార్మికులకు కనీస సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. వీటిపై తాము నిరంతరం దృష్టిసారించి అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

హక్కుల సాధనకు రాజీలేని పోరాటం

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్



కార్మిక చట్టాలు సమర్థవంతంగా అమలు..వారి హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. తమ పోరాటాల ఫలితంగానే స్కీం వర్కర్లు, అసంఘటితరంగ కార్మికులకు వేతనాలు పెరిగాయని గుర్తుచేశారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఐటీయూ ద్వారా చేపట్టిన పోరాటాలు..భవిష్యత్తులో కార్మికుల హక్కుల కోసం చేపట్టబోయే పోరాటాలపై ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వివరించారు.

అనేక మందికి వేతనాలు పెంపు

స్కీం వర్కర్లతో పాటు అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మాంగనీసు, టోల్‌ప్లాజా కార్మికులు, హమాలీకార్మికులతో పాటు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు వేతనాలు పెరగడంలో సంఘం నిర్వహించిన పోరాటాలే కారణం. మరోపక్క రిమ్స్ ఆస్పత్రిలో సుమారు 400మంది కార్మికులు పనిచేస్తుంటారు. అక్కడ పూర్తిస్థాయి వేతనాలు రాకపోవడంతో కార్మికులకు నష్టం జరిగేది. దశల వారీగా విస్తృత పోరాటాలు నిర్వహించడం ద్వారా ప్రస్తుతం రిమ్స్‌కార్మికులకు వేతనాలు పెరిగాయి. వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు పరిష్కారమయ్యాయి. వీటితో పాటు గ్రామ పంచాయతీ కార్మికులు కొందరిని విధుల్లోకి తొలగించడంతో వారి తరఫున పోరాడితే తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. వీరికి సైతం కనీసం వేతనాలు అమలు చేయాలని పోరాటాలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం ఐకేపీ వీఓఏలకు మద్ధతుగా నిలబడి పోరాటం చేపడుతున్నాం.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే

కేంద్రప్రభుత్వం కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చింది. ఇవి అమలైతే కార్మికుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. సంఘం పెట్టుకునే హక్కు కూడా లేకుండా పోతోంది. ప్రమాదకరమైన ఈ లేబర్‌కోడ్‌లను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి. మేడే స్ఫూర్తితో కార్మికులకు 8గంటల పని విధానం ఉండాలని ఆనాడు పోరాటాలు చేసి సాధించుకున్నాం. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తిరిగి 12గంటల పనిదినాన్ని పెంచుతూ చట్టబద్ధం చేసింది. తిరిగి దీన్ని రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తాం. అన్ని స్కీంలను బలోపేతం చేయడంతో పాటు వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం. కార్మికుల హక్కులను కాపాడటానికి సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుంది. సమస్యల సాధనకు కృషిచేస్తుందని కిరణ్ పేర్కొన్నారు.

సంక్షేమం ఉంది..అవగాహన లేకుంది..!

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

శ్రమకోర్చి చమట చిందించే కార్మికులు వారికి దక్కాల్సిన హక్కులు, ప్రయోజనాలకు దూరమవుతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేకించి కార్మికశాఖ ద్వారా వివిధ పథకాలు అమలు చేస్తున్నా.. వాటిని పొందడంలో కార్మికులు వెనుకబాటుకు గురవుతున్నారు. అవగాహన లేమి కారణంగా అనేక పథకాలకు దూరం కావాల్సివస్తోంది. ఈ పథకాలు పొందడంలో భవన నిర్మాణ రంగ కార్మికులు మాత్రమే కొంత మేర అవగాహన కలిగి ఉన్నట్లు కనిపిస్తోంది. జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు 27,691 మంది నమోదు చేసుకున్నారు. వీరికి ప్రమాదబీమా సౌకర్యం, సాధారణ మరణం, మెటర్నిటీ బెనిఫిట్స్, మ్యారేజ్‌గిఫ్ట్, ప్రసూతి సహాయం, ఆస్పత్రి ఖర్చులు, శాశ్వత అంగవైకల్యం తదితర పథకాల కింద అర్హులైన 2021-22 ఏడాదిలో 260మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.1.19కోట్లు ప్రయోజనం కల్పించింది. 2022-23 ఏడాదిలో 901మంది లబ్ధిదారులకు ఆయా పథకాల కింద రూ.2.91కోట్లు చెల్లించినట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి.

అవగాహన లేక దూరం..!

భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు అందజేస్తుంది. కార్మికులు రూ.110 చెల్లించి కార్మికశాఖ నుంచి గుర్తింపు కార్డు పొందుతున్నారు. అదే దుకాణాలు, వివిధ సంస్థల్లో పనిచేసేవారికి కూడా వాటి యజమానులు విధిగా కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేయాల్సి ఉంటుంది. వీటి ద్వారా కార్మిక సంక్షేమ మండలి అమలు చేస్తున్న పథకాలు పొందేందుకు ఆస్కారం ఉంటుంది. ఇందులో భాగంగా వైద్య సహాయం కింద రూ.20వేలు, ప్రమాద మరణం కింద రూ.30వేలు, సహజ మరణానికి రూ.20వేలు, అంగవైకల్యం సంభవిస్తే రూ.20వేలు, అంత్యక్రియల ఖర్చు కోసం రూ.5వేలు, వివాహ కానుక కింద రూ.10వేలు, ప్రసూతి సహాయం రూ.5వేలు, విద్యా ప్రోత్సాహకం కింద చదువులను బట్టి ఆర్థిక సాయం అందజేస్తుంది. కానీ వీరిలో చాలా మందికి అవగాహన లేని కారణంగా ఆయా ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. జిల్లాలో 18,546మంది కార్మికులు ఉండగా 2021-22 ఏడాదిలో కేవలం 9మంది లబ్ధిదారులు మాత్రమే రూ.75వేలు సహాయం పొందగా 2022-23 ఏడాదిలో ఇద్దరు మాత్రమే ఆయా పథకాల కింద రూ.15వేల ఆర్థిక సాయం పొందడం గమనార్హం.

ఈ శ్రమ్‌కార్డుతోనూ ప్రయోజనాలు..!

కేంద్రప్రభుత్వం ఇటీవల అసంఘటిత రంగ కార్మికుల కోసం ఈ శ్రమ్‌కార్డులను ప్రవేశపెట్టింది. వీటిని అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరూ దీని పరిధిలోకి వస్తారు. వ్యవసాయ కూలీలు, వాటి అనుబంధ సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులు, వీధి వ్యాపారులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, ఇండ్లలో పనిచేస్తున్న వారు, ఆటోడ్రైవర్లు ఇలా ఇన్‌కం ట్యాక్స్(ఐటీ) పరిధిలోకి రాని ప్రతి ఒక్కరు ఈ శ్రమ్‌కార్డును పొందేందుకు అర్హులుగా పరిగణించబడుతారు. సీఎస్‌సీ సెంటర్‌లో ఆధార్, బ్యాంకు ఖాతా సాయంతో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఎలాంటి రుసుము లేకుండా ఐదు నిమిషాల్లో ఈ కార్డును తీసుకునేందుకు వీలుంటుంది. ఇప్పటి వరకు ఆదిలాబాద్ జిల్లాలో ఈ శ్రమ్ కార్డును 1,27,193మంది తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ కార్డు ఉంటే ప్రమాద బీమా కింద రూ.2లక్షలు, అంగవైకల్యం ఏర్పడితే రూ.1లక్ష సాయం అందుతుంది. ఇంకా అనేక మంది ఈ కార్డుకు అర్హులు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో అవగాహన లేని కారణంగా దరఖాస్తు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు.

విద్యార్థులు శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఖానాపూర్

విద్యార్థులు వేసవికాలంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ అన్నారు. ఆదివారం ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నటువంటి వేసవికాల శిక్షణ శిబిరం ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో విద్యార్థుల కోసం పట్టణంలో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. బాలికల క్రీడల కోసం ప్రత్యేకంగా బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడలు నిర్వహిస్తారని అన్నారు. క్రీడలు ప్రారంభం తేదీ : మే 1 నుండి 31 వ తేదీ వరకు జరుగుతాయని అన్నారు. ఉదయం 7:00 నుండి 10:30 వరకు క్రీడలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ క్రీడల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ హాజరై క్రీడాలను ప్రారంభిస్తారని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు శిక్షణ శిబిరాలకు పిల్లలను పంపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ అబ్దుల్ ఖలీల్, మున్సిపల్ కమిషనర్ రత్నాకర్ రావు, పీఈటీలు ఇమ్రాన్, క్రాంతి, అజిం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వినేష్ ఫోగాట్, సాక్షి మాలిక్‌లకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్



మహిళా రెజ్లింగ్ వినేష్ ఫొగాట్, సాక్షి మాలిక్‌లకు న్యాయం చేయాలని బహుజన జాగృతి సేన జిల్లా అధ్యక్షుడు యం.బుధరతన్, ఉపాధ్యక్షులు కే నాందేవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌక్ వద్ద బీజేఎస్ అధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒలంపిక్స్‌లో భారత్‌కు అత్యధిక పతాకాలు అందించిన మల్లయోధులు జాతీయ రెజ్లింగ్ సమాఖ్య డీబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడి మూలంగా మానసిక శారీరక వేదింపులకు గురవుతున్నారని అన్నారు. డీబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై కేవలం కేసులు నమోదు చేయడమే కాకుండా వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కారణంగా బెటి బచావో బేటి పడావో అన్న నినాదం నీరు గారుతోందన్నారు. సొంత గూట్లో అవమానాన్ని ఎదుర్కొంటున్న మహిళా రేజర్లను న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. ఇతర క్రీడాకారులు కూడా ఈ అంశంపై గళమేత్తాలని కోరారు. నిరసన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఝాడే నాందేవ్, బీజేఎస్ కార్యకర్తలు కేశవ్‌రావ్, సునీల్, తులసిరాం, సోమాజీ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలో ఆదివారం శారదనగర్ నుండి రైల్వే స్టేషన్ వైపు బైక్‌పై గంగాధర్ వెల్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో అతనికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స నిర్వహించి, అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై భరత్ సుమన్ ఆదివారం తెలిపారు. మండలంలోని బాబాపూర్ గ్రామ శివారులోని అడవి ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి (35) చెట్టు కు ఉరేసుకొని ఉన్నాడు. అటుగా వెళ్లిన గ్రామ ప్రజలు పోలీసులకు సమాచారం అందించినట్టు పేర్కొన్నారు. మృతుని వద్ద ఎలాంటి అధారాలు లభించలేదని, మృతుడు చెట్టుకు ఉరేసుకొని ఉండవచ్చని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాబాపూర్ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని యువకుడు ఉరేసుకున్న ఘటనపై సోషల్ మీడియాలలో వైరల్ అయ్యింది. ఈ యువకుడు వివరాలు తెలిస్తే కింది ఫోన్ నెంబర్ ఎస్సై ఉట్నూర్ 8712659939, సీఐ ఉట్నూర్ 8712659937 లకు సంప్రదించాలని కోరారు.

సునీత్ చోప్రా స్ఫూర్తితో ఉద్యమాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు సునీత్ చోప్రా స్ఫూర్తితో వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలను నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు లంక రాఘవులు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం సునీత్ చోప్రా సంతాప సభను జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేసి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సాధించడంలో కీలక పాత్ర వహించి నేడు ఉపాధి కూలీల ఆశ జ్యోతిగా నిలబడ్డారని కొనియాడారు పార్లమెంట్ సభ్యులుగా ఉన్న సందర్భంలో పేదల కష్టాలను సభ దృష్టికి తీసుకువస్తూ పార్లమెంట్‌లో పేదల గొంతును వినిపించారని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆయన స్ఫూర్తితో పేదల ఉద్యమాన్ని నడుపుతోందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు స్వామి, ఆశన్న, కేశవ్, గంగారాం, రాజక్క, శంకర్, రాజక్క పాల్గొన్నారు.



నైజాం దొరలను తరిమి కొట్టింది విప్లవ పార్టీలే

- ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి అల్లపు పీటర్



నవతెలంగాణ-కడెం

నైజాం దొరలను తరిమి కొట్టింది విప్లవ పార్టీలేనని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి అల్లపు పీటర్ అన్నారు. 138వ మేడే సందర్భంగా మండలంలోని ఎలగడప, లింగాపూర్, ధర్మాజీపేట్ ఆయా గ్రామాల్లో ఎంసీపీఐయూ నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జెండాలను ఆదివారం ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి అల్లపు పీటర్ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య సురేందర్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని కమ్యూనిస్టు పార్టీలంతా ఐక్యతకు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలపై బడుగు బలహీన వర్గాలపై మోయలేని భారం మోపుతూన్నారని అన్నారు. అధిక ధరలు పెంచి మోయలేని భారం మోపి పెట్రోల్, డీజిల్, సిలిండర్ ధరలు నిత్యవసర వస్తువుల ధరలు పెంచి జీఎస్టీ పేరుతో పేదవాడు బ్రతికే పరిస్థితులు లేకుండా చేస్తున్నారని అన్నారు. అంతే కాకుండా చదువుకున్న యువకులకు ఉపాధి అవకాశాలు లేక తల్లిదండ్రులు వారి చదువుపై చేసిన అప్పులు తీర్చలేక ఎందరో యువకులు ఆత్మహత్య చేసుకుంటున్నారని అన్నారు. ఫ్యాక్టరీలలో కార్మికులు 12గంటలు పని చేస్తున్నారని అన్నారు. సరియైన వేతనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్మికులను బానిసల్లాగా వాడుకుంటున్నారని అన్నారు. రైతులకు విద్యుత్ మోటార్లకు మీటర్స్ బిగించడానికి చట్టాన్ని సిద్ధం చేసిన కేంద్ర ప్రభుత్వం ఈసారి అధికారంలోకి వస్తే ఇలాంటి చట్టాలన్నీ అమలు చేయడానికి సిద్ధం చేసుకుని ఉన్నదని గుర్తు చేశారు. అమెరికాలోని చికాగో నగరంలో నుండి ప్రారంభమైన పోరాటం ప్రపంచవ్యాప్తంగా సిద్ధించిందని పోరాటాల ద్వారా ఎన్నో రక్తాలు చిందించి ఎర్ర జెండా ముద్దుబిడ్డ లేనని బానిసల్లగా ఉన్న సమయంలో పోరాటాలు చేసి ప్రజలకు అండగా నిలబడింది కమ్యూనిస్టు పార్టేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయూ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా సురేందర్ అఖిల భారత మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు స్వరూప, జిల్లా నాయకురాలు లింగ లక్ష్మి, నిర్మల్ పట్టణ కార్యదర్శి గణేష్, కడెం మండలం కార్యదర్శి హైమద్ ఖాన్ సంధ్యా, రాధ, లింగన్న పాల్గొన్నారు.

అవినీతి ఎమ్మెల్యేల చిట్టాను బహిర్గతం చేయాలి

- ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జీ జిల్లాపెల్లి నవీన్



నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళితబంధు పథకంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడ్డారని ఆ అవినీతి ఎమ్మెల్యేల చిట్టా తన వద్ద ఉందని సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో ఆ బీఆర్ఎస్ అవినీతి ఎమ్మెల్యేల చిట్టాను బహిర్గతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జీ జిల్లాపెల్లి నవీన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌక్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను వెంటనే సస్పెండ్ చేయాలని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వారిని అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకొని పక్షంలో బీఆర్ఎస్ ప్రభుత్వంతో రాజకీయ యుద్ధం తప్పదని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మోరే శ్రీకాంత్, గణేష్, కిరణ్, సీతారాం ఉన్నారు.

ధాన్యం కనుగోళ్లు చేయాలని రాస్తారోకో



నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

ధాన్యం కొనుగోళ్లు చేయడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆదివారం ఖానాపూర్ మార్కెట్ యార్డు ఎదుట రహదారిపై రైతులు బైటాయించారు. రైతులకు కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్ మాట్లాడారు. రైతులు ధాన్యం తెచ్చి 15 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకపోవడం శోచనీయమని అన్నారు. కల్లాలపై ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసిపోయి రైతులకు పనిభారం పెంచి నష్టం కలిగించిదని తెలిపారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం తూకం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిమ్మల రమేష్, చిన్నం సత్యం, షబ్బీర్ పాషా, జంగిలి శంకర్, తోట సత్యం, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ తుది రాత పరీక్ష

- 52 మంది అభ్యర్థులు గైర్హాజరు
- పరీక్ష కేంద్రాలు తనిఖీ చేసిన ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన కానిస్టేబుల్ తుది రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 12 పరీక్ష కేంద్రాలలో 4820 అభ్యర్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా, 4768 అభ్యర్థులు హాజరై, 52 అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు దాదాపు 99శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉదయం అకాల వర్షంతో ఇబ్బంది పడుతున్న విద్యార్థిని, విద్యార్థులను ప్రత్యేకంగా పోలీసు వాహనాలలో పరీక్షా కేంద్రాల వద్ద సకాలంలో విడిచిపెట్టడం జరిగింది. అదేవిధంగా జిల్లా ఎస్పీ స్వయంగా 12 పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల పోలీసు సిబ్బందితో పరిసర ప్రాంతాలకు ఇతరులకు అనుమతించకూడదని, సిబ్బందికి తగు సూచనలు చేశారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో విజయవంతంగా పూర్తయ్యేలా కృషిచేసిన అందరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లు ఎస్.శ్రీనివాసరావు, సి సమయ్ జాన్ రావు, డీఎస్పీలు వి.ఉమేందర్, ఉమామహేశ్వరరావు, పోతారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సోయా రైతులకు పరిహారం మంజూరు

నవతెలంగాణ- బేల

మండలంలో గత వానా కాలంలో విక్రాంత్ సీడ్స్ సోయాబీన్ సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎట్టకేలకు పరిహారం మంజూరు అయిందని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బేల మండలంలో విక్రాంత్ సీడ్ వేసి నష్టపోయిన రైతులకు పరిహారం రాకపోవడంతో అనేక సార్లు ఆందోళనలు చేపట్టినట్లు గుర్తుచేశారు. రైతుల పక్షాన ఆమరణ నిరాహార దీక్ష చేసేందుకు సిద్ధమయ్యానని ఈ క్రమంలో సంబంధిత కంపెనీ యాజమాన్యం దిగివచ్చి పరిహారం అందజేసిందని తెలిపారు. మండలంలో 126మంది రైతులకు రూ.22.35లక్షలు పరిహారం మంజూరు చేస్తూ చెక్కులను సంబంధిత సీడ్స్ దుకాణాలకు పంపించారని తెలిపారు. ఈ సందర్భంగా బేల మండల రైతులు రూపేష్‌రెడ్డిని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసీ రాందాస్ నాక్లే, కాంగ్రెస్ నాయకులు గావండే ఘనశ్యామ్, వానకడే రూప్ రావ్, శంకర్ భోక్రే, విపిన్ రాక్రె,రాకేష్ బన్కర్, అవినాష్ గోడే, చంద్ర కాంత్ మడావి పాల్గొన్నారు.

పార్టీని వీడే ప్రసక్తే లేదు : భూక్యా జానుబాయి



నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

బీజేపీలో టికెట్ కోసం ముగ్గురు పోటీలో ఉన్న మాట వాస్తవమేనని ఎవరికి టికెట్ వచ్చినా కలిసి పని చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పెంబి జెడ్పీటీసీ భూక్యా జానుబాయి స్పష్టం చేశారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రంలో మన్‌కీబాత్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె మాట్లాడారు. బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా బరిలో ఉండేందుకు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నానని ప్రజలు ఆశీర్వదించి బిజెపి అవకాశం ఇస్తే తాను సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఉద్యోగాన్ని వదులుకొని ప్రజాసేవ కోసమే సమయాన్ని కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఖానాపూర్ నియోజకవర్గంలో బిజెపి పార్టీ ప్రజలకు దగ్గరవుతున్న తరుణంలో నేను సైతం ప్రజాసేవలో ముందు ఉంటానని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు పార్టీ అవకాశం ఇవ్వకపోయినప్పటికీ ఎవరికి అవకాశం ఇచ్చినా అభ్యర్థి గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని, బిజెపి పార్టీని వీడే ప్రసక్తి లేదని ఆమె ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. అవకాశం రానంత మాత్రాన పార్టీని వీడి మరో పార్టీలకు వెళ్లే ఆలోచన లేదన్నారు. ప్రజలు తనను ఆశీర్వదిస్తారని నమ్మకం ఉందని స్థానికంగా పుట్టి పెరిగిన నన్ను ఆశీర్వదించాలని కోరారు.

నాణ్యమైన విద్య అందించడమే గురుకుల విద్యాలయాల లక్ష్యం

నవతెలంగాణ- నిర్మల్



నాణ్యమైన విద్యను అందించడమే తెలంగాణ గురుకుల విద్యాలయాల లక్ష్యమని నిర్మల్ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నీరడి గంగాశంకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం వేసవి ఉచిత ఎంసెట్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ రాష్ట్ర కార్యదర్శి సీ హెచ్ రమణకుమార్, ఉప కార్యదర్శి సీఎస్ ప్రసాద్ నేతృత్వంలో గురుకుల విద్యార్థినులకు నెలపాటు ఉచిత శిక్షణను అందించినట్లు చెప్పారు. నిర్మల్, పోచంపాడ్, బోధన్ గురుకులాల విద్యార్థినిలకు నిర్మల్‌లో ఏప్రిల్ 1 నుండి ఏప్రిల్ 30వ తేదీ వరకు శిక్షణ అందించామన్నారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులు కె.హర్షిణి, బి. అమూల్య, గంగోత్రి, కె. హనీన్యలకు బహుమతులను ప్రదానం చేశారు. శిక్షణను ఇచ్చిన అధ్యాపకులను సన్మానించారు. ఇందులో అధ్యాపకులు వెంకట్, గురుకుల విద్యా కమిటీ చైర్మన్ రామేశ్వర్, ఉపన్యాసకులు వేణుగోపాల్, నవీన్, మహేశ్, దీపక్, వేణు, యోగేశ్, రోహిణి, రజిని, విద్యార్థినులు, పోషకులు పాల్గొన్నారు. .

బీఆర్ఎస్ పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటా

- బీఆర్ఎస్ నాయకులు శ్రీహరిరావు



నవతెలంగాణ- సారంగాపూర్

బీఆర్ఎస్ పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటామని ఆ పార్టీ సీనియర్ నాయకులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. ఆదివారం సారంగాపూర్ మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల నిర్మల్ పట్టణంలో నిర్వహించిన టిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన సమావేశంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో నిర్మల్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం ఎవరిని బరిలో నిలిపినా వారి గెలుపు కోసం శాయశక్తులా కృషిచేస్తానని పేర్కొన్నారు. టిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ బలోపేతానికి తాను శక్తివంచన లేకుండా కృషి చేశానని తెలంగాణ ఉద్యమంలో అహర్నిశలు శ్రమించానని గుర్తు చేశారు. బిఆర్ఎస్ పార్టీని వీడబోతున్నట్లు వస్తున్నటువంటి ఆరోపణలు అవాస్తవమని తాను బీఆర్ఎస్ పార్టీ విడబోనని అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉద్యమ కారులు బోలోజి నర్సయ్య, హధి ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి

నవతెలంగాణ-కడెం



మండలంలోని పెద్దూర్‌తండ వద్దనున్న ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి చెందిన ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదర్ద్యార్ తండ సమీపంలోని ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం వన్యప్రాణి చుక్కల దుప్పినీ ఢీకొనడంతో దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని దుప్పి మృతి పట్ల స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతి చెందిన దుప్పిని కననం చేయడం కొరకు తీసుకు వెళ్తున్నట్లు ఫారెస్ట్ బీట్ అధికారి లచ్చన్న తెలిపారు.

పూర్వ విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం



నవతెలంగాణ- నిర్మల్

జిల్లాకేంద్రంలోని స్థానిక మయూరి ఇన్‌లో ఆదివారం 2001-2002 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన శ్రీ సరస్వతి జ్ఞాన మందిర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. జ్యోతి ప్రజ్వలన చేసి గురువులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 22 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు ఈ సందర్భంగా తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గురువులు మాట్లాడుతూ, సమాజంలో యువత పాత్ర కీలకమైందని అన్నారు. దేశభక్తులుగా ఎదుగుతూ సమాజ సేవచేయాలని కోరారు. అనంతరం గురువులు బి వెంకట్, హన్మంతు, వెంకట్ రెడ్డి, సురేశ్ , పురుషోత్తం, నర్సయ్య, అంబారాణి, సురేఖ, సుహాసిని, ప్రణీతలను శాలువా, మెమెంటోతో సన్మానించారు. ఇందులో విద్యార్థులు హరీశ్, దినేశ్, రాజు, వంశీ, శ్రీకాంత్ రెడ్డి, హారిక, త్రివేణి, సుమలత ,లక్ష్మి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కలప రవాణా చేస్తే చర్యలు

నవతెలంగాణ-ఉట్నూర్



అడవి నుండి అక్రమంగా కలప తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కవ్వాల్ టైగర్ జోన్ బిర్సాయిపెట్ ఎఫ్ఆర్ఓ మొయినోద్దీన్ అన్నారు. ఆదివారం కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని అల్లంపల్లి గ్రామం నుండి ఉట్నూర్ వైపుకు బొలెరో (ఏపీ21టీడబ్ల్యూ 9167) వాహనంలో అక్రమంగా కలప దుంగలను తరలిస్తున్నారని పక్క సమాచారంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. దాడిలో పట్టుకున్న 17 టేకు దుంగలు ఉన్నాయని వాటి విలువ రూ.94వేల వరకు ఉంటుందన్నారు. వాహనంను రేంజ్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి గోవింద్, బీట్ అధికారులు అజయ్, ప్రతాప్, బలవంత్ రావు ఉన్నారు.

ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా మాన్ కి బాత్ ప్రదర్శన


నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలోని పోలింగ్ బూత్ పరిధిలో ఆదివారం దేశ ప్రధాని నరేంద్ర మోడీ మాన్ కి బాత్ కార్యక్రమాన్నీ బీజేపీ నాయకులు ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి ప్రజాలు వీక్షించేల చేశారు. ఉదయం 11 నుండి 12 గంటలవరకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగాన్ని ప్రజలు శ్రద్ధగా విన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయినాథ్, రమేష్ పాల్గొన్నారు.















ఆర్మీ ఉచిత మెడికల్ క్యాంపు, అవగాహనా సదస్సు

రెబ్బెన: పదో తరగతి, ఇంటర్ మీడియట్ పూర్తి చేసుకొని ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, కేంద్ర పారా మెడికల్ బలగాలైన సీఐఎస్‌ఎఫ్, సీఆర్‌పీఎస్, బీఎస్‌హెచ్ వంటి ఉద్యోగాల్లో చేరాలనుకొనే విద్యార్థుల కోసం ఆర్మీ ఉచిత మెడికల్ క్యాంపు, అవగాహన సదస్సు మే 2న ద్రోణాచార్య డిఫెన్స్ అకాడమి కరీంనగర్‌లో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. 2న ఉదయం గోలేటి టౌన్‌షిప్ నుండి ఉచిత బస్సు బయలుదేరుతుందన్నారు. గోలేటి, తాండూర్, బెల్లంపల్లి, సోమగూడెం, మందమర్రి, మంచిర్యాల నుండి కరీంనగర్ వరకు అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం సత్యనారాయణ ఫోన్ నెంబర్ 8919158374ను సంప్రదించాలని పేర్కొన్నారు.






















చెస్ టోర్నమెంట్ ఏర్పాట్లను పరిశీలించిన అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ - రెబ్బెన

గోలేటిలోని సింగరేణి పాఠశాలలో సోమవారం జరగనున్న అండర్-7, 9, 11, 13, 16, ఓపెన్ చెస్ ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాకు సంబంధించిన చెస్ టోర్నమెంట్ ఏర్పాట్లను ఆదివారం జిల్లా చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ సంపత్‌కుమార్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కనకయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. చెస్ క్రీడాకారులు ఉదయం 9గంటల్లోపు గోలేటిలోని సింగరేణి పాఠశాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోగె ఉపేందర్, వామన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సమ్మయ్య నరేష్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కంట్రోలర్

నవతెలంగాణ-నిర్మల్

ఫోన్ పోగొట్టుకున్న బాధితురాలికి ఫోన్ అందజేసి నిర్మల్ బస్టాండ్ ట్రాఫిక్ కంట్రోలర్ శ్యామ్ సుందర్ నిజాయితీ చాటుకున్నాడు. నిర్మల్ బస్టాండ్‌లోని భైంసా పాయింట్ వద్ద కుర్చీలో శ్యామ్ సుందర్‌కు ఫోన్ దొరికింది. కొద్దిసేపటి తర్వాత ఆ ఫోన్‌కు కాల్ రాగా, తమ ఫోన్ పోయిందని తెలిపారు. బస్టాండ్‌కు వచ్చి తీసుకెళ్లాలని బాధితురాలికి ఆర్టీసీ సిబ్బంది సూచించారు. సదరు ప్రయాణికురాలు యామిని భైంసా నుంచి వచ్చి అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్ చేతుల మీదుగా ఫోన్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు. ఇందులో ఆర్టీసీ సిబ్బంది జి.ఎస్.నారాయణ,ఆన్ డ్యూటీ కంట్రోలర్ శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి అభివృద్ధి సాధించాలని ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్ సూచించారు. మండల కేంద్రంలో కేబి కాంప్లెక్స్‌లో ఎస్బీఐ ఆర్ సెట్టి ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ ముగింపు సందర్భంగా ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు శిక్షణ పత్రాలు అందజేతలో ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్ పాల్గొని అందించారు. ఎంపీపీ మాట్లాడుతూ స్వయం ఉపాధి కల్పన కోసం అందించే శిక్షణలను మహిళ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని, పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఆయన వెంట ఎస్బీఐ ఆర్ సెట్టి సిబ్బంది ఉన్నారు.

అడెల్లి ఆలయాన్ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ- సారంగాపూర్

మండలంలో ప్రసిద్ధి గాంచిన అడెల్లి మహా పోచమ్మ ఆలయాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ముత్యంరెడ్డి, కరిపే విలాస్, సాహెబ్ రావు,చెన్ను రాజేశ్వర్, మదు,పలువురు నాయకులు ఉన్నారు.

మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ తిలకించిన ఏలేటి

నవతెలంగాణ- నిర్మల్

ప్రధాని నరేంద్ర మోడీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ ను ఆదివారం నిర్మల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి జిల్లాకేంద్రంలోని తన నివాసంలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మన్‌కీ బాత్ కేవలం కార్యక్రమం మాత్రమే కాదని, ఇది దేశ ప్రజలందరి ఆలోచనలను పంచుకునే బృహత్తర వేదికని అన్నారు. ఇన్ని రోజుల ప్రయాణాన్ని ఓ ఆధ్యాత్మిక యాత్రగా ప్రధాని నిర్వహించారని తెలిపారు. బేటీ బచావో- బేటీ పడావో, స్వచ్ఛ భారత్ అభియాన్, ఆజాద్ కా అమృత్ మహోత్సవ్, ఇలా ఏ కార్యక్రమమైనా సరే అది మన్ కీ బాత్‌తో ముడిపడి పోయిందన్నారు. సెల్ఫీ విత్ డాటర్ అనే ఇనిషియేటివ్‌కి భారీ స్పందన వచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అక్షయ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

అక్షయ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ లో పేదల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ హాజరై పేదలకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా అక్షయ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు భూపతిగౌడ్ ప్రతి ఆదివారం విధిగా నిత్యం ఎందరో బాటసారులు రాకపోకలు సాగించే రైల్వే స్టేషన్లో అన్నదాన కార్యక్రమం చేపట్టడం చాలా అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ నాయకులు కార్యకర్తలు, అక్షయ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు భరత్ చంద్ర, మయూరి, సతీష్ గౌడ్, సాయి పాల్గొన్నారు.

కేంద్రమంత్రి నితిన్ గడ్కరికి ఆహ్వాన పత్రిక అందజేసిన ఎంపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు సోయం బాపురావు ఆదివారం కలిశారు. తన కుమారుడు, బీజేపీ యువనేత సోయం వెంకటేష్ వివాహం ఆదిలాబాద్‌లో మే 21న ఉన్నందున తప్పక హాజరు కావాలని ఎంపీ విన్నవించారు. ఆ తర్వాత జిల్లా రహదారులు ఇతర పరిస్థితుల గురించి చర్చించారు. పెళ్లికి వస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు

నవతెలంగాణ-కౌటాల

శ్రీ వాసవి మాత జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆలయ పూజారి మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, హారతి, దీపారాధన, హోమం, కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం భక్తులందరు సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో మండలంలోని ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో భారీ వర్షం

- కొనుగోళ్లు చేయకపోవడంతో తడిసిన ధాన్యం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్‌లో శనివారం రాత్రి భారీవర్షం కురిసింది. మార్కెట్ యార్డుకు రైతులు తీసుకువచ్చిన ధాన్యం పూర్తిగా తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బారీగా కురిసిన వర్షానికి వర్షపు నీరు ప్లాట్‌ఫాంలపై చేరడంతో ధాన్యం తడిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం కారణంగానే...

తమ ధాన్యం తడిసి పోవడానికి అధికారులు, పాలకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని సదరు రైతులు ఆరోపించారు. ధాన్యం మార్కెట్‌కు తెచ్చి 15 రోజులు అవుతున్నా కొనుగోళ్లను ప్రారంభించక పోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ధాన్యాన్ని వర్షం బారి నుంచి కాపాడుకోవడానికి మార్కెట్ చైర్మెన్‌ను టార్పలీన్ అడిగితే లేవని తెలిపారు. దీంతో రైతులు నర్సయ్య, రాజేశ్వర్, మహేష్, పంతంగి మల్లేష్, బైండ్ల రాజన్న, మహేష్ ధాన్యం తడిపోయిందని వాపోయారు. ప్రభుత్వం నుంచి టార్పలీన్‌లు వచ్చినా కూడా మార్కెట్ కమిటీ పాలకులు రాలేవని చెప్పడం ఆశ్చర్యంగా ఉందని వారు ఆవేధన వ్యక్తం చేశారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



నేను ధాన్యం తెచ్చి పదిహేను రోజులవుతుంది. తేమ శాతం పూర్తిగా లేకుండా ఆరబెట్టాను. ఎప్పుడు కొంటారని సొసైటీ ఆధికారిని అడిగితే తమకు ఎలాంటి అనుమతులు రాలేవని అన్నాడు. నిన్న రాత్రి కురిసిన వర్షానికి ఎండిన వడ్లు మొత్తం తడిసిపోయాయి. మళ్లీ ఆరబెట్టాల్సి పరిస్థితి ఏర్పడింది.

సొర్ల నర్సయ్య రైతు. తర్లాపాడ్ గ్రామం

నేటి నుంచి కొనుగోళ్లు చేపడుతాం

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఈ సారికూడా సొసైటీకి అనుమతి ఇచ్చారు. కొనుగోళ్లను సోమవారం నుంచి ప్రారంభిస్తాం. రైతులు గమనించాలని కోరుతున్నాం.

సీఈఓ ఆశన్న

బంగారుగూడ వాసులకు అన్యాయం చేస్తున్నారు: బీజేపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మున్సిపాలిటీ బంగారుగూడ కాలనీలో ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో శాశ్వత నిర్మాణాలు చేసుకుని ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని బిజెపి జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ జీవో 58 ప్రకారం దరఖాస్తు చేసుకునేందుకు మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన కాలనీవాసులతో ఆయన మాట్లాడారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జీవో 58 అనుసరించి ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు కట్టుకున్న వారికి రెగ్యులరైజ్ చేసేందుకు చివరి తేదీ అయితే అధికారులు ఈ విషయాన్ని దాచిపెట్టి పేదలకు తెలియకుండా చేసి వారిని మోసం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. పేర్లు నమోదు చేసుకోవడానికి ఈ రోజు చివరి తేదీ అని, అధికారులు, నాయకులు ఈ విషయాన్ని ఎందుకు దాచి పెట్టారని, దీని వెనక మతలబు ఏముందని ధ్వజమెత్తారు. పేదల్లో అవగాహన కల్పించని కారణంగా 1400 కుటుంబాలు అన్యాయానికి గురయ్యాయని తెలిపారు. ఒక్క రోజులో 1400 అప్లికేషన్లు అప్‌లోడ్ చేయడం అధికారులకు సాధ్యకాదని, ఆదివారం అధికారులు కూడా అందుబాటులో ఉండరు కాబట్టి చివరి తేదీని పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనుకుంట కౌన్సిలర్ శ్రీనివాస్, బిజెపి నాయకులు శ్రీనివాస్, రత్నాకర్‌రెడ్డి, ముకుందరావు, రాజు పాల్గొన్నారు.

అర్హులైన వారికి పట్టాలు : మున్సిపల్ చైర్మన్

ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడలో నెలకొన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నామని, త్వరలోనే అర్హులైన వారికి పట్టాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ స్పష్టం చేశారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతంలో వర్షాభావ పరిస్థితిలో బంగారుగూడలో నెలకొన సమస్యలపై ఎమ్మెల్యే జోగు రామన్న కాలినడకన తిరుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకోవడమే కాకుండా వారి డిమాండ్లను త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పి పలుసార్లు హామీ ఇచ్చిన సంఘటనను గుర్తు చేశారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం బంగారిగూడ వాసులకు పట్టాల పంపిణీ ప్రక్రియ కొనసాగిస్తామని, అయితే కొందరు స్థానికంగా నెలకొన్న సమస్యపై బీజేపీ నాయకులు అనవసర దుష్ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే జోగు రామన్న సూచనల మేరకు బంగారిగూడలో సర్వే శరవేగంగా కొనసాగుతోందని తెలిపారు. త్వరలోనే స్థానికులకు ఇండ్ల నంబర్లు కేటాయించి, పట్టాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎంపీ కనీసం బంగారుగూడను సందర్శించలేదన్న ఆయన కేంద్రం నిధులతో ఎటువంటి పనులు చేపట్టలేదని మండిపడ్డారు. అభివృద్ధికి ఆటంకం కలిగించేలా ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్ మోబిన్ పాల్గొన్నారు.



'మన్ కీ బాత్' వీక్షించిన బీజేపీ నాయకులు'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ ప్రధాని నరేంద్రమోడీ చేపట్టిన మన్ కీ బాత్ వందో ఎపిసోడ్‌ను ఆదిలాబాద్ జిల్లా బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్, జిల్లా, పట్టణ నాయకులు ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా పాయల్ శంకర్ మాట్లాడుతూ మొట్ట మొదటి సారి ఐక్య రాజ్య సమితిలో మన్ కీ బాత్ ప్రత్యక్ష ప్రసారం కావడం చాలా గొప్పదని, ఇంతవరకు ఏ దేశ ప్రధాని ఇలాంటి తరహా ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం కాలేదని అన్నారు. ఇది భారత దేశానికి గర్వకారణమని మోదీ తీరును ప్రశంసించారు. ప్రసారం అయిన మన్ కీ బాత్‌లో అటు కాశ్మీర్ నుండి హర్యానా, కర్ణాటక, మణిపూర్, ఆంధ్రప్రదేశ్ మొదలగు రాష్ట్రాలలో కొయ్య బొమ్మలు, హిమాలయాల్లో స్వచ్ఛ భారత్, పలక పెన్సిల్ పరిశ్రమ, మొదలగు వాటిల్లో దేశానికి సేవలు చేస్తున్న విభిన్న వ్యక్తులతో ప్రత్యక్షంగా మాట్లాడించటం చాలా సంతోషం కల్గించిందని తెలిపారు. దీని ద్వారా ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న ఉత్పత్తులు, సేవలు తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమం వీక్షించిన వారిలో పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ మాయుర్ చంద్ర, అసెంబ్లీ కన్వీనర్ బోయర్ విజయ్, కౌన్సిలర్ ఉషకం రఘుపతి, పట్టణ అధ్యక్షులు లాలమున్న, జిల్లా ఉపాధ్యక్షులు దినేష్ మాటోలియా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకత్ రమేష్, జిల్లా నాయకులు నల్ల రత్నాకర్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ల ప్రవీణ్, పార్టీ నాయకులు ధోని జ్యోతి, చిలుకూరి జ్యోతిరెడ్డి, సునందరెడ్డి, భీంసేన్‌రెడ్డి, ముకుందరావు, సాయితేజ పాల్గొన్నారు.

సీతాగోంది శివారులో జంట హత్యల కలకలం

- రెండు రోజుల క్రితం హత్య
- అక్రమ సంబంధమే కారణమని ప్రాథమిక నిర్ధారణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండలంలోని సీతాగోంది పంచాయితీ పరిధిలోని గర్కంపేట సమీపంలో వ్యవసాయ భూమిలో రెండు మృతదేహాలు స్థానికంగా కలకలం రేపాయి. స్థానికులు గుర్తించి స్థానిక సర్పంచ్ భీంరావు సమాచారం అందించగా ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై ప్రవీణ్ కుమార్ విషయాన్ని పోలీసు ఉన్నత అధికారులు తెలియ జేయడంతో ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ సహా సీఐ ముదావత్ నైలూ పోలీసు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృత దేహాలను పరిశీలించగా ఇరువురి తలలను తీవ్రంగా గాయపరిచి హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. సంఘటనా స్థలానికి సమీపంలోని బీటీ రోడ్డుపై నిలిచిన ఉన్న స్కూటీని పరిశీలించిన పోలీసులు దాని నంబరు ఆధారంగా మృతుడు జిల్లా కేంద్రంలోని భక్తాపూర్‌కు చెందిన మొహమ్మద్ రహమాన్ (20)గా గుర్తించారు. కాగా మతుడి శవానికి 32 అడుగుల దూరంలో పడి ఉన్న యువతి మృత దేహాన్ని గుర్తించారు. యువతి జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన వివాహిత సోన్‌కాంబ్లే అశ్విని(28)గా గుర్తించారు. ప్రాథమికంగా సేకరించిన వివరాలతో ఇది హత్యగా భావించిన పోలీసులు క్లూసీం, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. ఈ హత్యలకు ఆక్రమ సంబంధం కారణమై ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ కోణంలో దర్యాప్తు చేపట్టి వీలైనంత త్వరగా మిస్టరీని ఛేదిస్తామని డీఎస్పీ నాగేందర్ వెల్లడించారు.

ఘనంగా మైసమ్మ విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ- లక్ష్మణచాంద

మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామంలో ఆదివారం మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మిషన్ భగీరథ పనుల్లో భాగంగా బ్రహ్మణ చెరువు కట్ట ఎత్తు పెంచడంతో మైసమ్మ తల్లి చెరువు కట్ట కిందికి కావడంతో ఊరుకు అరిష్టమని భావించిన గ్రామస్తులు మైసమ్మ తల్లి విగ్రహాన్ని పున: ప్రతిష్టించారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, పోతరాజు నత్యాలతో డప్పుచప్పుల మధ్య ఘనంగా ప్రతిష్టించారు. అనంతరం భక్తులు, గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మే డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ - రెబ్బెన

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా 137వ మే డే వేడుకలను ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకోవాలని బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి పేర్కొన్నారు. సోమవారం ఏరియాలోని అన్ని ఓసీలు, డిపార్టుమెంట్లలో మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమానికి కార్మికులు, కర్షకులు, యూనియన్ నాయకులు, కార్యకర్తలు, సీపీఐ శ్రేణులు, విద్యార్థి యోజన సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సీపీఐ గోలేటి పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్ కోరారు.

పీహెచ్‌సీలో అందుబాటులో లేని సిబ్బంది



నవతెలంగాణ-భీమిని

మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదురుకొన్నారు. ఆదివారం ప్రమాదానికి గురై చికిత్స కోసం కారుకూరి ప్రసాద్ ఆస్పత్రికి వచ్చాడు. సిబ్బంది ఎవరు లేక పోవడంతో కాసేపు నిరీక్షించి చేసేదేమిలేక వెనుదిరిగాడు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్షంగా వ్యవహరించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది అందుబాటులో ఉండే విదంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆస్పత్రిలో డాక్టర్, ఏఎన్ఎం, ఫార్మసిస్ట్ ఎవరు అందుబాటులో లేరని జిల్లా వైద్యాధికారిని వివరణ కోరగా విషయం తెలుసు కొని మళ్ళీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని తెలిపారు.

ప్రధాన కూడళ్లలో 'మన్ కీ బాత్'

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రధాని నరేంద్రమోడీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నాయకులు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో తిలకించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎల్ఈడీ టీవీలను అమర్చి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు చేరాల శ్రీనివాస్, వీరభద్రచారి, ముత్తు అశోక్, అరుణ్‌లోయ, మాచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ మాత జయంతి వేడుకలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

వాసవీ మాత జయంతి వేడుకలను ఆదివారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈ వేడుకలను నిర్వహించారు. బాచంపల్లి కమలాకర్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక బాలాజీనగర్ నుండి ర్యాలీ నిర్వహించారు.

ఇన్నోవేషన్ టెక్నాలజీ బ్రాంచ్ ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సర్వా ల్యాబ్స్‌కు చెందిన జోన్ ఆఫ్ ఇన్నోవేషన్ టెక్నాలజీ బ్రాంచ్ కార్యాలయాన్ని ఆదివారం స్థానిక బాలాజీనగర్‌లో ఎంఈఓ భిక్షపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వా ల్యాబ్స్ సీఈఓ సాయి కృష్ణ మాట్లాడుతూ రోబోటిక్స్, ఫన్ సైన్స్, గ్రాఫిక్ డిజైనింగ్, హోమ్ ఆటోమేషన్, రాకెట్ సైన్స్, క్రేజీ కెమిస్ట్రీ తదితర టెక్నాలజీలను ఈ వేసవిలో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ ద్వారా నేర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్, సైన్స్ కో ఆర్డినేటర్ మామిడాల తిరుపతయ్య, మోర సంపత్, నల్ల కనకయ్య పాల్గొన్నారు.

ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంబాల ఓదేలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2014లో మూతపడ్డ సిర్పూరు పేపర్ మిల్లు పోరాటాల ఫలితంగా 2018లో పున:ప్రారంభమైనా కాంట్రాక్టు కార్మికులకు ఎలాంటి ప్రయోజనం కలుగలేదని పేర్కొన్నారు. ఇటీవల పర్మినెంట్ కార్మికులకు వేతనాలు పెంచిన యాజమాన్యం, కాంట్రాక్టు కార్మికుల గురించి మాత్రం పట్టించుకోలేదని అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన, చనిపోయిన కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాల్సిన గ్రాట్యుటీ కూడా ఇవ్వడం లేదని అన్నారు. సగానికి పైగా డిపార్ట్‌మెంట్‌లను ప్రైవేట్ కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చి, పర్మినెంట్ పని స్థలాలలో కాంట్రాక్టు కార్మికులతో పని చేయించుకుంటూ, ఎస్పీఎం యాజమాన్యం శ్రమదోపిడీకి పాల్పడుతోందని అన్నారు. ప్రతి ఐదేళ్లకోసారి సవరించాల్సిన కనీస వేతనాల జీఓను 2015 నుండి తొక్కిపెడుతున్నారని అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ప్రతీ రోజు కనీస వేతనం రూ. 751 చెల్లించాలని, ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే హామీ ఇచ్చిన రూ. 35 వేలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్పీఎం యాజమాన్యానికి లేఖ పంపించనున్నట్లు తెలిపారు,

అలరించిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

స్థానిక బాలభారతి ఉన్నత పాఠశాలలో 1989-90లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం స్థానిక పటేల్ గార్డెన్‌లో నిర్వహించారు.చ దీనికి ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాలలో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు హాజరు కావడంతో సందడి నెలకొంది. పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట కలువడంతో వారు గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో ఉపాధ్యాయులైన స్వరూపారాణి, వాణి, అశోక్, వెంటకరమణ, స్థానిక జెడ్పీఎస్-ఎస్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి హాజరయ్యారు.